# మళ్లీ చెప్పిన కథలు



రావి కొండలరావు

అదొక మహారణ్యం. అందులో క్రూర మృగాలూ అక్రూర మృగాలూ ఎన్నో వున్నాయి. ఎక్కడైనా అక్రూరులకంటె క్రూరులే ఎక్కువగా వుంటారు గనక అక్కడ క్రూర మృగాల సంఖ్యే ఎక్కువ. పైగా కొన్ని సాధు జంతువులు కూడా క్రూరంగా మారిపోయి, గోముఖ వ్యాఘ్రాల్లాగా, పయోధర విషకుంభాల్లాగా తిరుగుతున్నాయి.

ఆ మహారణ్యం మధ్యలో పెద్ద గుహ. ఆ గుహలో రాజుంటాడు. అతన్ని మృగరాజంటారు. మామూలుగా పేరు పెట్టి పిలిస్తే సింహం అంటారు. ఆ సింహపాలనలో మృగాలన్నీ బతుకున్నాయి. బలిసినవి బాగా బలిసి బతుకుతున్నాయి. లేనివి చిక్కిచిక్కి బతకలేక బతుకుతున్నాయి. మృగాలన్నీ నీళ్లు తాగడానికిగాను రాజుగారు చెరువులూ సరస్సులూ తవ్వించలేదు. యుగయుగాలుగా ఆ అరణ్యంలో ప్రవహిస్తున్న నదే అందరికీ శరణ్యం. కొన్ని జంతువులు దాహం వేసినప్పుడు ఆ నది దగ్గరకు పోయి దాహం తీర్చుకుంటే, కొన్ని ఆకలివేసినప్పుడు కూడా అక్కడికే వెళ్ళి నీళ్ళు తాగి ఆకలి తీర్చుకుంటాయి.

అలాగే, ఓ గొర్రెపిల్ల ఒంటరిగా వెళ్ళి నదిలో నీళ్లు తాగుతూవుంటే, ఓ తోడేలు ఓరకంట చూసింది. నీళ్ళు తాగుతున్న తోడేలు కళ్ళు గొర్రెపిల్ల మీద దిట్టంగా పడ్డాయి. తాగడం ఆపేసి. 'ఏకంగా ఇంకో విందుభోజనం చేసిన తర్వాతనే, నీళ్ళు తాగొచ్చుగా!' అనుకుంది. ఆ అడివిలో కూడా నీతి, న్యాయం; అవినీతి, అన్యాయం అన్నీ వున్నాయి. తను కావాలని గొర్రెపిల్ల మీదికి లంఘించి, చంపి తినేయడం నీతి కాదుగనక, ఏదైనా అభియోగం తెచ్చి దాన్ని భక్షించడమే ధర్మమార్గం-అనుకుంది.

"ఇదిగో గొర్రెపిల్లా! నేను తాగుతున్న నీళ్ళు ఎంగిలి చేస్తున్నావు. నీ పుట్టుకెంత? నా పుట్టుకెంత? కిరజాతిదానివి ఉన్న నీళ్ళన్నీ ఇలా మైలపరుస్తూవుంటే అగ్రజాతులవాళ్ళం సహించలేం! ఇక్కడ నేను నీరు సేవించడం చూసికూడా నువ్వు ఎంగిలి చెయ్యడం ఎంత ధైర్యం? నిన్నేం చేస్తానో చూడు!" అంది తోడేలు. తోక ఝాడిస్తూ.

గొర్రెపిల్ల—సింహం ముందు చిట్టెలుకలా వణికిపోయింది. ఐనా ధైర్యం తెచ్చుకుని నిభాయించుకుని నిలబడింది.

"నేనేం మీ నీళ్ళు ఎంగిలి చెయ్యడంలేదు-మన్నించాలి! ప్రవాహం మీ రేవు నుంచే ఇటు వస్తోంది. మీరు అక్కడ నీళ్ళు తాగుతున్నారు. ఈ దిగువ నుండి, మీరు ఎంగిలి చేసి వదుల్తున్న నీరే నేను తాగుతున్నాను గాని, నా ఎంగిలి మీకు తగలడానికి అవకాశం లేదు!" అంది గొర్రె పిల్ల.

## తోడేలు - గొర్రెపిల్ల

"ఎంత పొగరు నీకు! తర్కించి మాట్లాడుతున్నావు కూడాను-జాగ్రత్త! పోనీ, నువ్వుకాకపోతే నీ తండ్రి ఎంగిలి చెయ్య



లేదా?- నీ తాత ముత్తాతలు ఎంగిలి చెయ్యలేదా? వాళ్ళు చేసిన ఆ నేరానికి ఫలితం నువ్వు అనుభవిస్తావు!" అని తోడేలు పైపైకి వచ్చింది. గొర్రెపిల్ల భయంతో పెద్ద కేక పెట్టింది ఆ కేకకి కొన్ని గొర్రెలు గబగబా వచ్చాయి.

'పొట్టి గొర్రెల మంద! ఒక టొస్తే చాలు అన్నీ వెంట పరుగెత్తుకొస్తాయి' అనుకుంది తోడేలు. కళ్ళు ఉరుముతూ, "మీరంతా నీచులు! ద్రోహులు! ఎక్కడ వుండవలసిన వాళ్ళు అక్కడ ఉండడం లేదు. ఈ నది మొత్తం నీరంతా కలుషితం చేస్తున్నారు. మిమ్మల్నందర్నీ వరసనే నిలబెట్టి, వరపరా నమిలి మింగేసినా పాపం లేదు" అంది తోడేలు.

ఆ మాటకి గొర్రెలన్నీ నొచ్చుకున్నాయి. తామప్పుడు మందగా వున్నా, మందంగా వున్నా తోడేలు ముందు బలహీనమే. ఐనా ఉన్నవాటిలో వయసు వండిన ఓ గొర్రె ముందుకొచ్చి—

"ఈ నది నీటిని మేము ఎంగిలిచేసి కలుషితం చేస్తున్నామనడం న్యాయంకాదు. పెద్దలు మీరంతా ఆ పైన తాగుతూవుంటే, మేమంతా మీరు మిగిల్చిన నీటినే తాగుతున్నాము. మామీద మీరు అభాండంవేసి నిందించడం న్యాయంకాదు. కావాలంటే న్యాయాన్యాయ విచక్షణ తెలిసిన మృగరాజు దగ్గరకెళ్దాం పదండి" అంది.

"ఓ, అలాగే పద" అంది తోడేలు. గొర్రెలన్నీ కలిసి బయల్దేరబోగా "మీరంతా కట్టగట్టుకుని రాకవసరం లేదు— ఇక్కడే వుండండి, పెద్ద గొర్రె,పిల్ల గొర్రె వస్తే చాలు" అంది.

గొర్రెలన్నీ అక్కడే ఆగిపోగా 'నీళ్ళు తాగిన గొర్రెపిల్ల;వయసు పండిన గొర్రె తోడేలు వెనుక రాజు దగ్గరకి బయల్దేరాయి. తోడేలు చెప్పవలసినది తోడేలు, గొర్రె చెప్పవలసినది గొర్రె మృగరాజుతో చెప్పాయి. ఉభయపక్షాల వాదనంతా విని, మృగరాజు తోడేలుమీద గర్జించింది—

"అవిమాత్రం మృగాలు కావా! వాటికి మాత్రం నీరు అక్కర్లేదా? అంతా కలిసి ఒకచోట బతుకుతున్న వాళ్ళం. ఒకచోట నీళ్ళు తాగక, నాలుగు చోట్ల తాగుతామా? ఇలాంటి అభియోగాలు, అన్యాయాలు తెచ్చి మాట్లాడావంటే జాగర్త. అరణ్య బహిష్కారం చెయ్యగలను. వెళ్ళు! ఇంకెప్పుడూ గొర్రెల్నీ మేకల్నీ హీనంగా చూడకు" అని సింహం హుంకరించేసరికి తోడేలు తలదించుకుని వెళ్ళిపోయింది. తమ పక్షాన న్యాయంచెప్పి, రక్షించిన మృగరాజును కృతజ్ఞతతో చూస్తూ అమాయకంగా నిలబడిన రెండు గొర్రెల్నీ రెండోకంటికి తెలియనివ్వకుండా చావు దెబ్బకొట్టి. కడుపారా భక్షించింది—మృగరాజు!